https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:22 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / ఆదివారం, సెప్టెంబర్ 06,2026



- కొడంగల్‌లో 81 వేల ఓట్లు అనామలీస్ జాబితాలో ఉన్నాయని వెల్లడి
- 2029లో మోదీ ఓటమికి పునాది అన్న సీఎం
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర జరుగుతోందని ఆరోపణ
- లౌకిక శక్తులు ఏకం కావాలని రేవంత్ పిలుపు

# తెలంగాణలో కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

## బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా ఉందని ఆరోపణ

ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు.

### కొడంగల్‌లో 81 వేల ఓట్లు

తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడు తుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

### సారంపల్లి సేవలు చిరస్మరణీయం

రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు.

నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను

# దూషించలేదు..

నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది: ఎమ్మెల్సీ తాతా మధు

అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు


స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య

ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:

తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధుఅసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. “పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు” అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.



# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం



## సీఎం చంద్రబాబు

ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:

రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక ‘ఎకనామిక్ టైమ్స్’ పత్రిక తనను ‘వాటర్ మ్యాన్’గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ‘లీడర్‌షిప్ కాన్‌క్లేవ్’ లో చంద్రబాబు పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన చంద్రబాబు.. ఇప్పుడు జల సంరక్షణతో ‘వాటర్ మ్యాన్’గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు.ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు. పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని.. ఫ్లెక్సీలు, ఫోటోల కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలని, 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.



తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ ప్రతిపక్ష డీఎంకే పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ అసెంబ్లీ లో పోలీసు శాఖ పద్దులపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ.. డీఎంకే పాలనలో జరిగిన అవినీతిని, అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ , ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సహా పలువురు సీనియర్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు.ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు సహజమేనని, కానీ మహిళలపై అనుచితమైన, కించపరిచే వ్యాఖ్యలు చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా స్పష్టంచేశారు. డీఎంకేకు ఓటు వేయని ప్రజలను ఆ పార్టీ నేతలు విమర్శించడంపై ఆయన మండిపడ్డారు. ప్రజల తీర్పును గౌరవించకపోవడంవల్లే డీఎంకే నేడు ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని విజయ్ విమర్శించారు.

# మహిళలను కించపరిస్తే ఉపేక్షించేది లేదు..

## ప్రతిపక్ష డీఎంకేకు సీఎం విజయ్ వార్నింగ్

ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:

అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ.. డీఎంకే బండారం మొత్తం అధికారిక రికార్డుల్లో, అసెంబ్లీ లైబ్రరీలో అందుబాటులో ఉందని విజయ్ అన్నారు. 1977 నాటి సర్కారియా కమిషన్ నివేదికను ఆయన ఉటంకించారు. వీరాణం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో కాంట్రాక్టులు ఇచ్చేందుకు కమీషన్లు డిమాండ్ చేశారని, ఒక నిర్దిష్ట కంపెనీకి అనుకూలంగా వ్యవహరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.అంతేగాక ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణలను కూడా విజయ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ ఫండ్ల పేరుతో పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేశారని, కొన్ని లావాదేవీలలో 7.5 నుంచి 10 శాతం వరకు కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి వి సెంథిల్ బాలాజీ తన అధికారిక హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ అక్రమ లావాదేవీలలో మాజీ మంత్రికి సంబంధించిన అధికారులు, వ్యక్తులు భాగస్వాములుగా ఉన్నారని విజయ్ తెలిపారు.ఈడీ ఆరోపణలకు సంబంధించి ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ పేర్లను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే ఇవి కేవలం ఏజెన్సీ చేసిన ఆరోపణలు మాత్రమేనని, కోర్టులో ఇంకా రుజువు కాలేదని గమనించాలని అన్నారు. డీఎంకే అవినీతికి సంబంధించిన రికార్డులు చాలా ఉన్నాయని, అవన్నీ చదవాలంటే దాదాపు రెండు రోజులు పడుతుందని, అందుకే సభలో కేవలం సారాంశాన్ని మాత్రమే ప్రస్తా విస్తున్నానని విజయ్ చెప్పారు. ఇప్పటికే బహిరంగ రికార్డుల్లో ఉన్న ఆధారాల కోసం డిమాండ్ చేయడం మాని, తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డీఎంకేకు సవాల్ విసిరారు. తాను పదవి కోసమో, అధికారం కోసమో రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికే వచ్చానని స్పష్టంచేశారు. సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, ఎన్టీ రామారావు వంటి మహనీయుల వారసత్వాన్ని గుర్తుచేస్తూ, రాజకీయ ప్రత్యర్థులపై ప్రజల అభిమానమే అంతిమంగా గెలుస్తుందని విజయ్ విశ్వాసం వ్యక్తంచేశారు.

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాయపడిన

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:**


ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, సంజయ్ కల్వకుంట్ల నిమ్స్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. అసెంబ్లీ వద్ద పోలీసుల తోపులాటలో జరిగిన గాయాలకు ఫస్ట్ ఎయిడ్ చేయించుకున్నారు. కాగా, కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరిగింది. మహిళా ఎమ్మెల్యేలు అని చూడా కూండా జుట్టు పట్టి, చీరలాగి అమానవీయంగా ప్రర్తించారు.



## రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మహాభారతం చూపెట్టిండు : మన్నె క్రిశాంక్

**ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:**

రాహుల్ గాంధీ అదానీ, నరేంద్రమోదీ ఫొటోలు వేసుకుంటే తప్పు లేనిది.. ఇవాళ మేము కాంగ్రెస్ హామీల గురించి నల్లచొక్కా వేసుకుంటే తప్పయిందా..? అని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని మన్నె క్రిశాంక్ తీవ్రంగా ఖండించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అదానీ టీ షర్ట్ వేసుకుని పోయిన్రు కదా.. హరీశ్ రావు ఏడు సార్లు ఎమ్మెల్యే.. ఇప్పటివరకు ఓడిపోయింది లేదు.. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆయనను మీరు కింద పడేస్తరు. రేవంత్ రెడ్డి అయినా ఎన్నికల్లో ఓడిపోవచ్చు కానీ సబితా ఇంద్రారెడ్డి ఏనాడు కూడా ఓడిపోలేదు. వారి జుట్టు పీకుతరు..పోలీసులు జుట్టు లాగడం చూశాం.. రాష్ట్రంలో ఉన్న మహిళలు చూస్తున్నరు.. ఇందిరమ్మ పేరు పెట్టి సిగ్గు తీస్తున్నవ్ కదా రేవంత్ రెడ్డి.. ఇందిరమ్మ బ్రేక్ ఫాస్ట్ అంటవ్..అది బంద్ ఉంటది.. ఇందిరమ్మ చీరటలంటవ్..అవి పంపిణీ ఉండదు.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఎమ్మెల్యేల జుట్టు లాగుతరా..? సునితమ్మ చీర లాగుతరా..? అని ప్రశ్నించారు. ఇవాళ పుస్తకాల్లో చదివిన మహాభారతం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చూపెట్టిండు. కౌరవులందరు కలిసి అక్కడ మహిళలను అవమానపరిచారు. కౌరవ కాంగ్రెస్ అందరూ అక్కడ మహిళలను అవమానపరిచారన్నారు.




## ఉద్యోగాల పేరుతో మోసం

### : ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్
- లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు
- ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:**

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి.ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.



## స్వచ్ఛ వాయు సర్వేక్షణలో నల్లగొండకు

# జాతీయ స్థాయి గుర్తింపు

### వార్డు స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణ--2026లో కేటగిరీ--3లో 2వ ర్యాంక్

### -- అవార్డుతో పాటు రూ.20 లక్షల నగదు బహుమతి




**నల్లగొండ, ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక గుర్తింపు సాధించింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (చీజాప్రా)లో భాగంగా నిర్వహించిన వార్డు స్థాయి స్వచ్ఛ వాయు సర్వేక్షణ--2026లో దేశవ్యాప్తంగా 130 పట్టణ స్థానిక సంస్థలు (ఖూదీం) పాల్గొనగా, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ నంబర్--16 కేటగిరీ--3లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా రూ.20 లక్షల నగదు బహుమతితో కూడిన అవార్డును మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.వంశీకృష్ణ, వార్డు నంబర్--16 కార్పొరేటర్ పెరిక స్వాతి స్వీకరించారు.సెప్టెంబర్ 7న న్యూఢిల్లీలోని ఇందిరా పర్యావరణ భవన్‌లో గంగా ఆడిటోరియంలో జరిగిన స్వచ్ఛ వాయు దివస్--2026 కార్యక్రమంలో అవార్డు ప్రదానోత్సవం జరిగింది. చీజాప్రాలో భాగంగా నిర్వహించిన సర్వేక్షణలో గాలి నాణ్యత మెరుగుదల, రహదారి దుమ్ము నియంత్రణ, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం పెంపు, ప్రజల్లో అవగాహన వంటి అంశాలపై పట్టణ స్థాయిలో చేపట్టిన చర్యలను పరిగణనలోకి తీసుకున్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జంక్షన్ల అభివృద్ధి, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, బ్లాక్ ప్లాంటేషన్, ట్రాఫిక్ కారిడార్లలో పచ్చదనం పెంపు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (+ఫ్రూ) రూపాంతరం, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (వీ=ఖీ) ప్లాంట్ వంటి చర్యలను చేపట్టింది.ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఈ జాతీయ స్థాయి అవార్డు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు రావడం గర్వకారణం అన్నారు. నల్లగొండ ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహాయ సహకారాలతో నల్లగొండ నగర అభివృద్ధికి మరింత వేగం తీసుకువచ్చి, అన్ని డివిజన్లలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక పట్టణ సౌకర్యాలు కల్పిస్తూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్--1 కార్పొరేషన్‌గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమిషనర్ బి.వంశీకృష్ణ మాట్లాడుతూ... మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారం, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో నల్లగొండ నగరానికి మరింత మెరుగైన పట్టణ మౌలిక వసతులు, ఆధునిక పౌర సౌకర్యాలు, పరిశుభ్రమైన పరిసరాలు, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అందించే దిశగా చర్యలు కొనసాగిస్తామన్నారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన నల్లగొండ నిర్మాణానికి మరింత సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.

# ఇది శాసన సభనా.. లేక కౌరవ సభనా?

### మహిళా ఎమ్మెల్యేల చీరెలు లాగిన వారిని వదిలిపెట్టం : హరీశ్ రావు




**ట్రై నెట్ న్యూస్ సెప్టెంబరు07:**

ఇది శాసన సభనా.. లేక కౌరవ సభనా? మహిళా ఎమ్మెల్యేల చీరెలు లాగుతారా? ప్రజాప్రతి నిధులపై పోలీసులను ప్రయోగిస్తారా? ఎమ్మెల్యేలను మెడ పట్టి గెంటేస్తారా..ఇదేం రాజ్యం రేవంత్ రెడ్డి, పోలీ సు రాజ్యం నడుపుతున్నావా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తోపులాట జరి గింది. మహళా ఎమ్మెల్యేలు అని చూడా కూండా జుట్టు పట్టి, చీరలాగి అమానవీయంగా ప్రర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఈరోజు బ్లాక్ డే అన్నారు

**చీరెలు లాగిన పోలీసులను వదిలిపెట్టం**

ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, పింఛన్లు, ఫీజు రియింబర్స్ మెంట్, రైతులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల గురించి అసెంబ్లీలో మమ్మల్ని మాట్లాడకుండా గొంతు నొక్కారు. వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు బట్ట బయలు అవుతాయని కాంగ్రెస్ ప్రభుత్వం భయపడిందన్నారు. అందుకే మా పై పోలీసులను ప్రయోగించారు. అమానుషంగా, అమానవీయంగా సభ్యుల పట్ల ప్రవర్తించారు. మహిళా శాసనసభా నాయకుల చీరెలు లాగుతారా? మా పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తారా? మా మహిళా సభ్యుల చీరెలు లాగిన పోలీసులను వదిలిపెట్టం అని హెచ్చరించారు.సునితమ్మ చీర లాగిన పోలీసులను, సబితమ్మ గొంతు నొక్కిన పోలీసులను, జగదీష్ రెడ్డిని కింద పడేసిన వారినైనా సరే.. సప్త సముద్రాల అవల ఉన్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. హాస్పిటల్‌కు కూడా తీసుకు వెళ్లకుండా అడ్డుకుంటారా? కేటీఆర్ చేయి గీరుకుపోయింది, ముఖం మీద గీరుకు పోయింది. యాదవ రెడ్డికి కుడి కాలు గోరు పోయింది. ఎమ్మెల్యేలు రాజశేఖ రెడ్డి కాలు కమిలి పోయింది, సంజయ్ చేయికి దెబ్బ తగిలింది. హోం మంత్రి, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి నువ్వు తగిన మూల్యం తప్పించుకోక తప్పదన్నారు. బిజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సంగ్ చేసుకొని 22ఎ మీద, ఫీజు రియంబర్స్‌మెంట్ మీద నామమాత్రపు చర్చ చేస్తారా? ప్రధాన ప్రతిపక్షం వద్దా అని నిలదీశారు.రాజకీయ వార్తలు చదవండి

**రాహుల్ గాంధీ చేస్తే రైటా..**

రాహుల్ గాంధీ, ప్రియాంక నల్ల టి షర్ట్స్ వేసుకొని పార్లమెంట్ కు వెళ్లారు. ఇక్కడ ఎందుకు అడ్డుకుంటారు. మేము ప్రజల తరుపున నిరసన తెలుపుతుంటే అడ్డుకుంటున్నారు. రేవంత్ రెడ్డి లాగా మేము బడివే అనలేదు, పైల్వాన్లు ఉన్నరు కొడుతరు అనలేదు. మేం మీ వైఫల్యాల గురించి ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్నాం. ప్రధాన ప్రతిపక్షం లేకుండా చర్చ జరుపుతాం అంటే ఈ ప్రభుత్వం పారిపోయినట్లేనని ఎద్దేవా చేశబూరు. మీరు తప్పు చేయకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టడం లేదు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడం లేదు. విద్యార్థులు రోడ్ల మీద ఎక్కి ధర్నాలు చేస్తున్నారు. వందలాది మంది వచ్చి వినతులు ఇస్తున్నరు.

**బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్**

ఉద్యోగాలు చేయలేక పోతున్నా, ఉన్నత చదవులకు వెళ్ల లేకపోతున్నాం అని ఆవేదన చెందుతున్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి మ్యాచ్ ఫిక్సింగ్ చేసి, బీఆర్ఎస్ సభలో లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పథకం ప్రకారం ఒక కుట్రతో వ్యవహరిస్తున్నారు. మమ్మల్ని సస్పెండ్ చేయడానికి ఒక వ్యూహం ప్రకారం నడుచుకున్నారు. ఎన్ని కుట్రలు చేసినా 22ఎ, ఫీజు రీయింబర్స్ మెంట్ వైఫల్యాల గురించి వదిలిపెట్టం.స్కాంలు, వైఫల్యాలు బయట పడుతాయనే ఇదంతా చేసారని విమర్శించారు. తొక ముడిచి పథకం ప్రకారం కుట్ర పన్నారు. మా చెల్లమ్మ గొంతు నొక్కితే చూస్తూ ఊరుకుంటారా? ఒక అక్క గొంతు పిసికితే చేతులు కట్టుకొని చూస్తూ ఉండాలా? ఇదేం ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. ప్రజల సమస్యల మీద చర్చ అంటే ప్రభుత్వం బయపడుతున్నది. ప్రజాక్షేత్రంలో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు.